క్లుప్తంగా

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



ప్రతిజ్ఞ చేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది, గర్భిణులు

రుద్రంగి: పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఐసీడీఎస్ సూపర్ వైజర్ మమత అన్నారు. మండలంలోని అడ్డబోర్ తండా గ్రామంలో శుక్రవారం పోషణమాసం కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. పోషకాహార లోపంతో వచ్చే వ్యాధులను గురించి వివరిస్తూ పోషకాహారం తీసుకున్న పిల్లల్లో శారీరక, మానసిక ఎదుగుదల ఉంటుందన్నారు. అనంతరం ధరావత్ శారధ అనే మహిళకు శ్రీమంతం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు పద్మ, మంజుల, అరుణ, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

వ్యవసాయ పరిశోధన సంస్థకు మండెపల్లి రైతులు



వ్యవసాయ పరిశోధన సంస్థలో రైతులు

తంగళ్లపల్లి: వ్యవసాయంలో ఇప్కో నానో యూరియా, నానో డీఏపీ వాడకంపై మండెపల్లి రైతులకు శుక్రవారం హైదరాబాద్‌లోని కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ బండి రాజు, రైతులు మల్లేశం, వెంకట్, నర్సయ్య, ప్రభుదాస్, ప్రశాంత్, రమేశ్, మహేశ్, కృష్ణబాబు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న బీజేపీ నాయకులు

వేములవాడరూరల్: మండలంలోని ఫాజుల్‌నగర్ గ్రామంలో పలు అభివృద్ధి పనులకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ భూమిపూజ చేశారు. ఎంపీ బండి సంజయ్ నిధులు, మండల పరిషత్ నిధులు దాదాపు రూ.10 లక్షలతో గ్రామంలోని హైమాస్ట్ లైట్లు ప్రారంభించి, సీసీ రోడ్లకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బండ మల్లేశంయాదవ్, రూరల్ బీజేపీ అధ్యక్షుడు జక్కుల తిరుపతి, ముదిరాజ్, కురుమ సంఘం నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

కుంకుమపూజలు.. మంగళహారతులు



వేములవాడ: కుంకుమపూజ చేస్తున్న మహిళలు

గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వివిధ గ్రామాల్లో గణనాథుడు శుక్రవారం విశేష పూజలందుకున్నారు. మండపాల వద్ద మహిళలు ఒకవైపు సామూహిక కుంకుమ పూజలు చేయగా, మరోవైపు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఎల్లారెడ్డిపేట మార్కండేయ ఆలయంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, కోనరావుపేట మండలం నిజామాబాద్‌లో కరీంనగర్ జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, మల్కపేట, ధర్మారంలో బీఆర్‌ఎస్ నాయకులు చల్మెడ లక్ష్మీనర్సింహారావు ,ప్రజాప్రతినిధులు, నాయకులు గణేశుని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

- వేములవాడ/వేములవాడఅర్బన్/ఎల్లారెడ్డిపేట/బోయినపల్లి/రుద్రంగి/కోనరావుపేట/ముస్తాబాద్



వేములవాడఅర్బన్: తిప్పాపూర్‌లో..



కోనరావుపేట: బావుసాయిపేటలో ..



ముస్తాబాద్‌లో కుంకుమ పూజలు



కోనరావుపేట: మల్కపేటలో పూజ చేస్తున్న చల్మెడ



బోయినపల్లి: వరదవెల్లి కుంకుమపూజలో మంగళహారతులతో మహిళలు



రుద్రంగిలో కుంకుమ పూజలు



వేములవాడ: బాలాపూర్ గణపతిని పోలిన గణేశుడు



ఎల్లారెడ్డిపేట: హరిదాస్‌నగర్‌లో..

రైతుల కోసమే సహకార బ్యాంకులు

- బ్యాంకుల ద్వారా 250 రకాలు సేవలు
- టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు

చందుర్తి: సాగులో తోడ్పాటునందిస్తూ.. రైతులకు అండగా నిలిచేందుకే సహకార బ్యాంకులను ఏర్పాటు చేస్తున్నట్లు టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు అన్నారు. చందుర్తిలో నూతనంగా ఏర్పాటు చేసిన కేడీసీసీ బ్యాంక్‌ను శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. పంట పెట్టుబడికి రుణాలు ఇవ్వడం దగ్గర నుంచి ధాన్యం కొనగోలు వరకు రైతులకు ఎన్నో రకాల సేవలందిస్తున్నామన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు ఉపాధి పొందేందుకు అవసరమైన రుణాలతోపాటు డెయిరీ, చేపల పెంపకం, ట్రాక్టర్లు, వరికోత యంత్రాలు, వ్యవసాయ పరికరాలు అందజేస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయదారుల 600 మంది పిల్లల ఉన్నత చదువులకు విద్యారుణాలు అందజేసినట్లు వివరించారు. తమ బ్యాంకులో రాష్ట్రంలోని 8 వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించామన్నారు. వ్యాపార రంగానికి కోటి రూపాయల వరకు రుణాలు అందజేస్తున్నట్లు తెలిపారు. తమ బ్యాంకుల ద్వారా 250 రకాల సేవలను అందుబాటులోకి తెచ్చామన్నారు. జిల్లా బ్యాంకు సీఈవో సత్యనారాయణరావు, కేడీసీసీబీ డైరెక్టర్ జలగం కిషన్‌రావు, చందుర్తి, వేములవాడ, కోనరావుపేట మండలాల సింగిల్‌విండో అధ్యక్షులు తిప్పని శ్రీనివాస్, ఏనుగు తిరుపతిరెడ్డి, బండ నర్సయ్య, స్థానిక జెడ్పీటీసీ నాగం కుమార్, వైస్‌ఎంపీపీ మందాల అబ్రహం, ఎంపీటీసీ పులి రేణుక, మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు ముస్కు ముకుందరెడ్డి, బ్యాంకు మేనేజర్ అజయ్‌కుమార్, సీఈవోలు ఏరెడ్డి గంగారెడ్డి, శ్రీవర్ధన్ పాల్గొన్నారు.



చందుర్తిలో కేడీసీసీబీని ప్రారంభిస్తున్న రవీందర్‌రావు

భవనం పనులు పరిశీలన

వేములవాడరూరల్: వేములవాడ మండల పరిషత్ ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న కేడీసీసీబీ భవన పనులను టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు శుక్రవారం పరిశీలించారు. రవీందర్‌రావు మాట్లాడుతూ పనుల్లో నాణ్యత ఉండాలన్నారు. త్వరగా పనులు పూర్తి చేసి భవనాన్ని అందుబాటులోకి తేవాలని సూచించారు. పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు తిరుపతిరెడ్డి, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ నర్సయ్య, చేనేత పారిశ్రామిక సహకార ఉత్పత్తి విక్రయ సంఘం అధ్యక్షుడు నాగుల సత్యనారాయణ, వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి, పట్టణ సీఐ కరుణాకర్, బ్యాంక్ మేనేజర్ సాయి, శేఖర్ ఉన్నారు.

చేనేతరంగానికి ప్రభుత్వం పెద్దపీట

వేములవాడఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం చేనేతరంగానికి పెద్దపీట వేస్తూ చేనేత కార్మికులకు ఉపాధి కల్పిస్తుందని టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్ రావు పేర్కొన్నారు. వేములవాడలోని చేనేత పారిశ్రామిక సహకార ఉత్పత్తి విక్రయ సంఘాన్ని వేములవాడ పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు తిరుపతిరెడ్డితో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత పారిశ్రామిక సహకార ఉత్పత్తి విక్రయ సంఘాల ద్వారా ఎందరో కార్మికులకు ఉపాధి దొరుకుతుందన్నారు. అనంతరం వేములవాడ మండల ప్రజాపరిషత్ కంపౌండ్ ఆవరణలో నిర్మిస్తున్న వేములవాడ కేడీసీసీబీ పనులను పరిశీలించారు. సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ, బ్యాంక్ మేనేజర్ సాయి, కొండ శేఖర్ తదితరులు ఉన్నారు.

రాజన్న సన్నిధిలో..

వేములవాడ: టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్ రావు శుక్రవారం రాజన్నను దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించారు. అనంతరం స్వామి వారి ప్రసాదాలు అందించి సత్కరించారు. సింగిల్‌విండో చైర్మన్ ఏనుగు తిరుపతిరెడ్డి తదితరులు ఉన్నారు.

గ్యారెంటీ కార్డు పేరుతో కాంగ్రెస్ మాయమాటలు

- మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

ఇల్లంతకుంట: కాంగ్రెస్ పార్టీ నలభై ఏళ్లలో చేయలేని అభివృద్ధి.. ఇప్పుడు గ్యారంటీ కార్డు పేరుతో ప్రజలను మాయమాటలు చెప్పి మోసం చేస్తుందని మానకొండూర్ ఎమ్మెల్యే, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ రసమయి బాలకిషన్ విమర్శించారు. మండలంలోని జవారిపేట బిక్కవాగుపై, గాలిపల్లిలో వంతెనల నిర్మాణానికి భూమిపూజ, మన ఊరు-మన బడి ప్రారంభం, ఇల్లంతకుంటలో రజకసంఘం భవనాలను ప్రారంభించారు. అనంతరం ఇల్లంతకుంటలో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కవ్వంపల్లికే తాను ఏ పార్టీలో ఉంటాడో గ్యారెంటీ లేదని, ఇక ప్రజలకు ఏం గ్యారెంటీ ఇస్తారని ఎద్దేవా చేశారు. అధికారం కోసమే ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు, ఎంపీపీ వెంకటరమణారెడ్డి, గాలిపల్లి పీఏసీఎస్ చైర్మన్ అనంతరెడ్డి, సర్పంచులు శిరీష, వాణి, భాగ్యలక్ష్మి, ఎంపీటీసీలు శ్యామలదేవి, అశ్విని, ఒగ్గు నర్సయ్యయాదవ్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి పాల్గొన్నారు.



బ్రిడ్జి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

జెడ్పీ పాఠశాలకు కంప్యూటర్ల వితరణ

ముస్తాబాద్: మండలంలోని పోతుగల్ జెడ్పీ ఉన్నత పాఠశాలకు బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు వెన్నమనేని శ్రీనివాస్‌రావు తన పుట్టిన రోజు సందర్భంగా ఐదు కంప్యూటర్లను అందజేశారు. పాఠశాల ఆవరణలో సర్పంచ్ తన్నీరు గౌతంరావు ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు నిర్వహించారు. 500 మొక్కలు నాటి, విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఇప్పటికే పోతుగల్ పీహెచ్‌సీకి అంబులెన్స్ అందించిన శ్రీనివాస్‌రావు, స్కూల్‌కు 5 కంప్యూటర్లు అందించారు. ఉపసర్పంచ్ మంజుల, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, హెచ్‌ఎం రాధాకిషన్‌రావు, చెక్కపల్లి రాజు, కారంగుల వెంకట్‌రావు, శేఖర్‌రావు, విశ్వనాథ్, రమేశ్, బాలనర్సు, విద్యాధర్, బాలయ్య, నాని, పర్శరాములు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న విద్యార్థినులు

వృద్ధురాలిని కూతుళ్లకు అప్పగింత

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి నందికమాన్ ఏరియాలో గురువారం రాత్రి ఏమి మాట్లాడలేని స్థితిలో ఉన్న వృద్ధురాలి ఆచూకీ లభించింది. చందుర్తి మండలం సనుగులగా గుర్తించిన అధికారులు ఆమె కూతుళ్లకు శుక్రవారం అప్పగించారు. నందికమాన్ ప్రాంతంలో గురువారం రాత్రి గుర్తు తెలియని వృద్ధురాలిని జిల్లా ఏరియా ఆస్పత్రికి తరలించారు. శుక్రవారం ఉదయం జిల్లా సంక్షేమశాఖ అధికారి లక్ష్మీరాజం ఆమె వివరాలు తెలుసుకోవాలని ఆదేశించారు. అధికారులు ఆమె వివరాలు తెలుసుకోగా.. చందుర్తి మండలం సనుగులకు చెందిన వృద్ధురాలుగా గుర్తించారు. వృద్ధురాలి ముగ్గురు కూతుళ్లకు సమాచారం అందించి.. తల్లిని అప్పగించారు.



తల్లిని కూతుళ్లకు అప్పగించిన అధికారులు

ఆశ వర్కర్లు సమ్మె బాట

వీర్నపల్లి: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 25 నుంచి నిరవధిక సమ్మెకు వెళ్తున్నట్లు ఆశ వర్కర్లు ప్రకటించారు. స్థానిక తహసీల్దార్ ఉమారాణికి, ఎస్సై నవతకు శుక్రవారం సమ్మె నోటీస్ అందజేసి మాట్లాడారు. ఎంతోకాలంగా చాలీచాలని జీతాలతో పనిచేశామన్నారు. కనీస వేతనం రూ.18 వేలు అమలు చేయాలని, చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశ వర్కర్ల సంఘం అధ్యక్షురాలు అనిత, శారద, చంద్రకళ, సువర్ణ, సీమ, ప్రేమలత, స్వప్న, సరిత, నవత, సావిత్రి, జమున, లావణ్య పాల్గొన్నారు.



సమ్మె నోటీసు ఇస్తున్న ఆశ వర్కర్లు

30న చెత్త నుంచి వస్తువుల తయారీపై పోటీ

వేములవాడ: చెత్త నుంచి వస్తువుల తయారీపై పోటీలు నిర్వహిస్తున్నట్లు వేములవాడ మున్సిపల్ కమిషనర్ అన్వేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. వేములవాడ పట్టణ ప్రజలు, యువత, స్కూల్ పిల్లలు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఔత్సాహికులు ఈనెల 22 నుంచి 28 వరకు తమ పేర్లను మునిసిపల్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఈనెల 30న నుంచి తయారు చేసిన వస్తువులను ప్రదర్శించాల్సి ఉంటుందన్నారు. పోటీలో విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు చెప్పారు. వివరాలకు 92982 57585 సంప్రదించాలని కోరారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి సబ్‌డివిజన్ ఆఫీస్



స్థల పరిశీలన చేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: విద్యుత్‌పరంగా ఉన్న అన్ని సమస్యలను సత్వరంగా పరిష్కరించడానికి ఎల్లారెడ్డిపేటలో సెస్ సబ్ డివిజన్ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు మండల సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని అంబేడ్కర్ కాలనీలో లోవోల్టేజీ సమస్యను పరిష్కరించేందుకు ఏర్పాటు చేస్తున్న కొత్త ట్రాన్స్‌ఫార్మర్ కోసం శుక్రవారం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోవోల్టేజీ సమస్యను పరిష్కరించేందుకు అవసరమున్న చోట అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ బందారపు బాల్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు బండారి బాల్‌రెడ్డి, ఎంపీటీసీ అనసూయ, నాయకులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి




మాట్లాడుతున్న సీఐ శశిధర్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సీఐ శశిధర్‌రెడ్డి కోరారు. మండలంలోని రాచర్లతిమ్మాపూర్‌లో శుక్రవారం గ్రామ పంచాయతీ సమీపంలో పోలీస్ కమ్యూనిటీ మీటింగ్ నిర్వహించారు. సీఐ శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ యువత గంజాయికి, డ్రగ్స్‌కు బానిసలు కావద్దని కోరారు. గ్రామంలో అనుమానితులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎస్సై రమాకాంత్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.వంద నాణెం పొందిన వ్యాపారి

- ఎన్టీఆర్ శతజయంతి సందర్భంగా విడుదల

సిరిసిల్ల: భారతీయ రిజర్వు బ్యాంకు(ఆర్‌బీఐ) ముద్రించిన రూ.వంద నాణేన్ని సిరిసిల్లకు చెందిన వ్యాపారి బుడిమె ప్రకాశ్ పొందారు. ప్రముఖ సినీనటుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్.టీ.రామారావు శతజయంతి ఉత్సవాల సందర్భంగా ఆర్‌బీఐ రూ.100 కాయిన్‌ను విడుదల చేసింది. ఈ నాణేన్ని సిరిసిల్లకు చెందిన వ్యాపారి, నాణేల సేకరణకర్త ప్రకాశ్‌కు శుక్రవారం అందింది. ఇప్పటికే ప్రకాశ్ వివిధ సందర్భాల్లో ఆర్‌బీఐ విడుదల చేసిన రూ.1000, రూ.50, రూ.60, రూ.75 నాణేలను సొంతం చేసుకున్నారు. మూడు దశాబ్దాలుగా పురాతనమైన నాణేలను, కరెన్సీ నోట్లను, విదేశీ కరెన్సీని సేకరిస్తున్నారు.



నాణెంతో ప్రకాశ్

వైఎస్సార్ పథకాలను బీఆర్‌ఎస్ కాపీ కొట్టింది

- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం

బోయినపల్లి: ఉమ్మడి రాష్ట్రంలో 2004లో అప్పటి కాంగ్రెస్ సీఎం దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలను, అధికారంలోకి వచ్చాక బీఆర్‌ఎస్ ప్రభుత్వం కాపీ కొట్టి తమ పథకాలుగా ప్రచారం చేసుకుంటోందని కాంగ్రెస్ చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం అన్నారు. వస్తున్నా మీ సేవకై లో భాగంగా శుక్రవారం రాత్రి మండలంలోని అనంతపల్లి గ్రామంలో గడప గడపకు కాంగ్రెస్ పల్లె పల్లెకు సత్యమన్న కార్యక్రమం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ 2014లో అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్, వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ, 108 సేవలు, ఫీజ్‌రీయంబర్స్‌మెంట్, రుణమాఫీ తదితర పథకాలను కాపీ కొట్టిందన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు గ్యారంటీ పథకాలతో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, ఎంపీటీసీ ఉయ్యాల శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.



అనంతపల్లిలో గ్రామంలో మేడిపల్లి సత్యం

క్రీడాకారిణికి సన్మానం

సిరిసిల్లఅర్బన్: మలేషియాలో జరిగిన 200 మీటర్ల పరుగు పందెంలో పాల్గొని రజత పతకం సాధించిన తమటం రామానుజమ్మను మున్సిపల్ వార్డు కౌన్సిలర్ పోచవేణి సత్య ఎల్లయ్య యాదవ్ శుక్రవారం శాలువాతో సన్మానించారు.



నీటి కోసం రోడ్డెక్కిన కేసీఆర్‌నగర్ వాసులు



మహిళలతో మాట్లాడుతున్న ఎస్సై వెంకటేశ్వర్లు

తంగళ్లపల్లి: మండలంలోని మండెపల్లి కేసీఆర్‌నగర్ (డబుల్ బెడ్రూం) సముదాయంలో శుక్రవారం నీటి కష్టాలు తీర్చాలంటూ మహిళలు రోడ్డెక్కారు. కేసీఆర్‌నగర్ సముదాయం కమాన్ వద్ద రోడ్డుపై బైఠాయించి ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీటి సరఫరా నిలిచిపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు నీటి ఇక్కట్లు తప్పేలా శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న తంగళ్లపల్లి ఎస్సై వెంకటేశ్వర్లు సిబ్బందితో కేసీఆర్‌నగర్ చేరుకుని మహిళలతో మాట్లాడి శాంతింపజేశారు. అధికారులతో మాట్లాడి నీటి సమస్యను పరిష్కరిస్తానని చెప్పడంతో ధర్నాను విరమించారు.

ముంపు గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి

బోయినపల్లి: మిడ్‌మానేరు ముంపు గ్రామాల్లో నిర్వాసితుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని బీజేవైఎం మండల ప్రధానకార్యదర్శి కొనుకటి హరీశ్ ఒక ప్రకటనలో కోరారు. పెండింగ్ సమస్యలు పరిష్కరిస్తామని గతేడాది సెప్టెంబర్‌లో అధికారులు ముంపు గ్రామాలు పర్యటించి, బాధితుల నుంచి దరఖాస్తులు తీసుకున్నారని తెలిపారు. ఏడాది గడిచినా సమస్యలు పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్వాసితుల ఇళ్ల నిర్మాణాలకు రూ.5.04 లక్షలు ఇస్తామని సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ ఏళ్లు గడిచినా నెరవేరడం లేదన్నారు.

సంక్షిప్త వార్తలు

పోయిన సెల్‌ఫోన్ అప్పగింత



ఎల్లారెడ్డిపేట: గత నెల 31న పోయిన సెల్‌ఫోన్ ఎక్కడుందో గుర్తించి, స్వాధీనం చేసుకొని శుక్రవారం బాధితుడికి అందజేసినట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు. మండలంలోని రాచర్లతిమ్మాపూర్‌కు చెందిన కరికే నరేశ్ సెల్‌ఫోన్ పోయినట్లు చేసిన ఫిర్యాదు మేరకు మొబైల్ ఐఎంఈఐ నెంబర్ ద్వారా సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిష్టర్ యాప్‌లో అప్లోడ్ చేసి, సెల్‌ఫోన్ ఎవరివద్ద ఉందో గుర్తించినట్లు ఎస్సై తెలిపారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

ఎల్లారెడ్డిపేట: విశిష్ట కళా రత్న జాతీయ పురస్కారం అందుకున్న ముత్యాల ప్రభాకర్‌రెడ్డి నేవూరి రెడ్డి సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సత్కరించారు. ప్రతినిధులు గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మహేందర్ రెడ్డి, నవజీవన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, లింగారెడ్డి, నర్సింహారెడ్డి, దేవేందర్‌రెడ్డి, ఎల్లారెడ్డి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

వేములవాడఅర్బన్: వేములవాడ పట్టణంలోని ఓల్డ్ అర్బన్ కాలనీలో వేములవాడ రూరల్ మండలం హన్మాజీపేట పీహెచ్‌సీ వైద్యాధికారి దివ్య ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.

చిన్నలింగాపూర్‌లో..

తంగళ్లపల్లి: మండలంలోని చిన్నలింగాపూర్ గ్రామంలో శుక్రవారం నేరెళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.

యువజన సంఘాల భవనాలు నిర్మించాలి

ఇల్లంతకుంట: మండలంలోని అన్ని గ్రామాల్లో యువజన సంఘాల భవన నిర్మాణాల కోసం కరీంనగర్ ఎంపీ బండి సంజయ్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని మండల యువజన సంఘాల సభ్యుడు మామిడి రాజు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ నాయకులను అరెస్టులు సరికాదు

ఇల్లంతకుంట: మండలంలో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పర్యటన ఉంటే కాంగ్రెస్ నాయకులను అక్రమంగా పోలీసులు అరెస్టులు చేసి బోయినపల్లి మండలంలో ఎందుకు తిప్పుతున్నారని కాంగ్రెస్ జిల్లా నాయకుడు పసుల వెంకటి ప్రశ్నించారు.

45 మందికి కల్యాణ లక్ష్మి మంజూరు

తంగళ్లపల్లి: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 45 మంది కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు శుక్రవారం కల్యాణలక్ష్మి చెక్కులు మంజూరైనట్లు ఎంపీపీ పడిగెల మానస తెలిపారు.